హైదరాబాద్
బుధవారం
10 మార్చి 10
4
సూర్య
సంపాదకీయం
editpage@suryaa.com

> "మహిళ అణగారిన తనానికి అన్ని విధాలా మూలమైన కుటుంబ వ్యవస్థలో ఆమెకు సమానత్వం సిద్ధించి పురుషుడితో సమానంగా అన్ని అవకాశాలు లభించినప్పుడే వాస్తవమైన సాధికారత ఆమెకు సంక్రమిస్తుంది. అంతవరకు చట్ట సభలలో రిజర్వేషన్లు కూడా పురుషుడి రిమోట్ కంట్రోల్‌లో పనిచేసేవిగా నిరూపించుకునే ప్రమాదమే పొంచి ఉన్నది. ఆ మేరకైనా ఆమెకు చట్ట సభలలో అడుగుపెట్టే అవకాశాలు మెరుగుపడడం హర్షించవలసిన పరిణామం. అదే సమయంలో ఈ అవకాశాన్ని బడుగుల మహిళలకు ఇంత దుర్మార్గంగా నిరాకరించడం అత్యంత వివక్షా పూరితం."

# చరిత్రాత్మకం- వివక్షాపూరితం

చట్ట సభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు 14 సంవత్సరాల వనవాసాన్ని దాటి రాజ్యసభలో ప్రవేశించడమే గాక ఆమోదాన్ని కూడా పొందిన 2010 మార్చి 9వ తేదీ భారత ప్రజల చరిత్రలోనే విశిష్ట స్థానాన్ని పొందుతుంది. ఇందుకు ఎంతైనా అనందించవలసిన సమయమిది. అదే సమయంలో భారతీయ సమాజానికి మాత్రమే పరిమితమైన కుల వ్యవస్థ విషపు కోరలలో చిక్కుకొని తరతరాలుగా అణగారిపోయి ఉన్న బిసి మహిళలకు, మైనారిటీల స్త్రీలకు ఉపకోటా ద్వారా వాటా కల్పించకుండా జరుగుతున్న మోసానికి ఎంతైనా దుఃఖించాలి. జనాభాలో సగభాగమై ఉండి కూడా పార్లమెంట్‌లో 11-12 శాతానికి మించి ప్రాతినిధ్యం ఎన్నడూ పొందని మహిళకు మూడో వంతు స్థానాలతో పట్టాభిషిక్తురాలిని చేసే చరిత్రాత్మక చర్యను చట్ట సభలలో అగ్రవర్ణ ప్రాతినిధ్యాన్ని ఆ మేరకు పెంచుకోవడానికి ఆ కిమ్మత్తుకు బిసిల ప్రాతినిధ్య స్థాయిని హరించడానికే మహిళా రిజర్వేషన్ల బిల్లు చట్ట రూపం ధరించబోతున్నదన్న కఠోర వాస్తవాన్ని, నిజమైన సమానత్వాన్ని కోరుకునే మానవీయ దృష్టి గలవారెవ్వరూ గమనించకుండా ఉండరు.

బిసిల మహిళలకు ఉపకోటా లేని మహిళా రిజర్వేషన్ల బిల్లు వల్ల లోక్‌సభలో మరి 181 స్థానాలు దాదాపు అన్నీ చదువు సంధ్యలలో, ధన బలంలో ముందున్న అగ్రవర్ణ మహిళలకే కైవసం అవుతాయి. డబ్బు పలుకుబడి ఉన్న అగ్రవర్ణ నేతల బంధు వర్గంలోని మహిళలే ఈ కోటా సీట్లు తన్నుకుపోవడానికి ఈ బిల్లు ద్వారా రాజమార్గం ఏర్పడుతున్నది. బయటి ప్రపంచానికి, మిగతా దేశాలకు ఈ బిల్లు చట్ట రూపం ధరించడం ఎంతో పురోగామి చర్యగా, విప్లవాత్మక ముందడుగుగా గోచరించి ప్రశంసలందుకోవడం సహజం. భారతీయ సమాజంలోని కులపరమైన దారుణమైన ఎగుడు దిగుడుల పట్ల అవగాహన గలవారికి ఇందులోని కుట్ర సుబోధకం కాగలదు. అందుచేత మహిళలకు చట్ట సభలలో రిజర్వేషన్లు కల్పించదలచిన బిల్లు ఇంత కాలానికి రాజ్యసభ ఆమోదం పొందినందుకు సంతోషిస్తూనే అమృతం పంపిణీలోని దారుణ పక్షపాతానికి తెరతీసి బిసి మహిళలకు ఉపకోటా లేకుండా చేస్తున్న దురన్యాయాన్ని తీవ్రంగా ఖండించవలసి ఉన్నది.

బిల్లుకు 14 ఏళ్ళుగా మోక్షం కలగకపోవడానికి సమాజ్‌వాది పార్టీ, ఆర్‌జెడి తదితర సామాజిక న్యాయ పార్టీల నేతల పురుషాధిక్యతా వైఖరే కారణమని అపప్రచారం అమితంగా సాగింది. పేద వర్గాల మహిళలకు కూడా న్యాయం కలిగేలా బిల్లులో ఉపకోటా కోసం పట్టుపట్టడాన్నే బిల్లుకు అడ్డుపడిన పురుషాధిక్యతా సైంధవ పాత్రగా వక్రీకరించడం జరిగింది. వారిప్పుడు పార్లమెంట్‌లో బలాధిక్యతను కోల్పోయారు కాబట్టి బిల్లును ఎటువంటి సవరణలు లేకుండా చట్టం చేసే దుస్సాహసానికి కాంగ్రెస్, బిజెపి, వామపక్షాలు పాల్పడ్డాయి. కుల వివక్ష చురకత్తి గాయాలు ఎన్నడూ చవి చూడని అగ్రవర్ణ పాలక వర్గ నేతృత్వంలోని ఈ మూడు శిబిరాలు బిసిలపై కుట్రలో ఇలా ఏకమయ్యాయి. సిపిఎమ్ సుష్మా స్వరాజ్‌లు, బిజెపి బృందాకారత్‌లు ఏకమై కాంగ్రెస్ అండ నిలిచి రాజ్యసభలో ఆమోదింప చేసుకున్న ఈ బిల్లు లోక్‌సభలో కూడా గట్టెక్కి దేశంలోని సగం శాసనసభల ఆమోదాన్ని పొందిన తర్వాత పూర్తిగా చట్టరూపం ధరిస్తుంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి ఆచరణకు నోచుకొని 181 మంది మహిళా సభ్యులతో లోక్‌సభ కళకళలాడుతుంది.

ప్రస్తుత లోక్‌సభలో మహిళా సభ్యుల సంఖ్య 59 మాత్రమే అన్న కఠోర సత్యం గమనార్హం. ఉన్న పళంగా వారి సంఖ్య మూడు రెట్లకు పైగా పెరుగుతున్నదన్న మాట. అలాగే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల శాసనసభలకూ మూడోవంతు మంది మహిళా శాసనసభ్యులు ఎన్నికై మహిళా శక్తిని చాటనున్నారు. మన రాష్ట్ర అసెంబ్లీకి 89 మంది మహిళలు ఎన్నిక కానున్నారు.

పురుషుడితో సమానంగా అన్ని రంగాలలోనూ సత్తా చాటుకోగల శక్తియుక్తులు మహిళకు దండిగా ఉన్నాయి. అయితే మతం అండతో శతాబ్దాలుగా రాజ్యం చేస్తున్న పురుషాధిక్యత మహిళను ద్వితీయ శ్రేణికి నెట్టివేసింది. పురుషుడితో సమానంగా కాక అతడి వెంటనడిచే దుస్థితికి దిగజార్చింది. అందుకే అభ్యుదయ దృక్పథం గల వారు ఇతర సామాజికంగా అణగారిన వర్గాలతో సమానంగా మహిళను పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో మహిళలకు చట్ట సభలలో రిజర్వేషన్లు ఎంతైనా హర్షించదగినవి.

అయితే మహిళ అణగారిన తనానికి అన్ని విధాలా మూలమైన కుటుంబ వ్యవస్థలో ఆమెకు సమానత్వం సిద్ధించి పురుషుడితో సమానంగా అన్ని అవకాశాలు లభించినప్పుడే వాస్తవమైన సాధికారత ఆమెకు సంక్రమిస్తుంది. అంతవరకు చట్ట సభలలో రిజర్వేషన్లు కూడా పురుషుడి రిమోట్ కంట్రోల్‌లో పనిచేసేవిగా నిరూపించు కునే ప్రమాదమే పొంచి ఉన్నది. ఆ మేరకైనా ఆమెకు చట్ట సభలలో అడుగుపెట్టే అవకాశాలు మెరుగుపడడం హర్షించవలసిన పరిణామం. అదే సమయంలో ఈ అవకాశాన్ని బడుగుల మహిళలకు ఇంత దుర్మార్గంగా నిరాకరించడం అత్యంత వివక్షా పూరితం. మహిళలకు కల్పిస్తున్న కోటాలో బిసిలు, మైనార్టీలకు చెందిన మహిళలకు ఉపకోటాను సాధించడానికి సామాజిక న్యాయవాదులంతా దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టి తీరాలి. ఆ డిమాండ్‌తో పార్లమెంట్‌లో శక్తి వంచన లేకుండా పోరాడుతున్న లాలూ, ములాయం, శరద్ యాదవ్‌లను, సమాజ్‌వాది, ఆర్‌జెడి, బహుజన సమాజ్, లోక్‌జన శక్తి వంటి పార్టీలను అభినందించాలి.

# తెలంగాణ రాజకీయం

## ఉద్యమంలో బి.సి.లు- అధికార పోటీలో అగ్రవర్ణాలు

సి. హెచ్. మధు

సైనికులు సైనికులే, రాజులు రాజులే! తరతరాల చరిత్ర మారడం లేదు. ప్రజాస్వామ్యమయితేనేం, ఏ రాజ్యమైతేనేం! అధికారం అగ్రవర్ణాలదే! జరుగుతున్న తెలంగాణ షో నిరూపిస్తున్న సత్యమిది. ఒకసారి అపారమైన తెలివితేటలు గల అగ్రకుల మేధావితో మాట్లాడడం జరిగింది. మేధావి అంటే ఆయనో న్యాయవాది. అగ్రకులం, ధనబలంతో వచ్చిన అహం కారం పోతపోసిన న్యాయవాది. ఈ వ్యవస్థలో కొందరు తమ కొమ్ములకు ఎదురు లేదన్నట్టుగా ప్రవర్తిస్తారు. వారికి 'చట్టం మమ్మల్నేమీ చేయదు' అనే అహంకారం అణువణువు ఉంటుంది.

> ఆంధ్రప్రదేశ్‌లో మొదటినుంచి రెండు అగ్రకులాల మధ్య ఆధిపత్య పోరు ఉంది. తెలంగాణలో రెండు అగ్రకులాలతో పోటీగా బీసీలు ఆధిపత్య పోరుకు సిద్ధమవుతున్నారు.

న్యాయవాదులు, పోలీసులు, జర్నలిస్టులలో ఇటువంటి వారున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అగ్రకులాలంటే రెడ్డి, రావు, కమ్మలు. తరతరాల వారసత్వ దొరతనాన్ని, రాజరికాన్ని ప్రజాస్వామ్య జెండా నీడలో పదిలంగా ఎగిరేస్తున్న వారు. ఇది పది సంవత్సరాల క్రితం కథ. ఆ న్యాయవాదితో రెండు గంటల పైగా జాతీయ, అంతర్జాతీయ విషయాలు మాట్లాడిన తర్వాత, సందర్భవశాత్తు 'అణగారిన వర్గాలు రాజ్యాధికారంలోకి వస్తే కొంత మార్పు రావచ్చు' అని నేనంటే ఆ న్యాయవాది ఓ మాట అన్నారు. 'రేపు నక్సలైట్ల రాజ్యం వచ్చినా మేమే రాజ్యమేలుతాం' అని. అది ఆత్మవిశ్వాసమో అహంకారమో అర్థం కాలేదు. పది సంవత్సరాలు గడిచిపోయాయి. వ్యవస్థలో పెద్ద మార్పు లేదు. అంతటా అగ్రకులాధిపత్యం చెలరేగుతూనే ఉంది. 60 శాతం బీసీలు- ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు కలసి 85 శాతం ఉన్నా, పెత్తనం 15 శాతం అగ్రకులాలదే ఉంది. తెలంగాణ పోరులో ఆ విషయం స్పష్టంగా కనిపిస్తుంది. ఒక దిక్కు తెలంగాణ కోసం బీసీలు, ఎస్సీలు ఉద్యమిస్తుంటే, ఆత్మబలిదానాలతో ఉద్యమాన్ని వేడెక్కిస్తుంటే మరో వైపు అగ్రకులాలు అధికారం కోసం పోటీపడి ఉద్యమాన్ని నీరు కార్చారు. ఇది పైకి కనిపించని చిత్రం. ఇది తెరవెనుక భాగోతం. ఇది అసలు సిసలైన తెలంగాణ షో!

రేపు తెలంగాణ వస్తే- ఇస్తే- నాయకత్వం అగ్రకులం చేతిలోనే ఉండాలి. ఇక్కడ మళ్ళీ పోటీ రెడ్డి- రావుల మధ్యే. ఇది తరతరాలుగా ఉన్న పోటీయే! తెలంగాణలో తరతరాలుగా రెడ్డిలు రాజ్యాధికారం అనుభవిస్తున్నారు. పల్లెలలో, జిల్లాలలో, పట్టణాలలో వాళ్ళదే రాజ్యం. సమైక్య ఆంధ్రప్రదేశ్ కళ్ళెం ఎవరి చేతులలో ఉన్నా (అక్కడ కూడా తరతరాలుగా రెడ్డిలదే రాజ్యం. పోటీపడి రామారావు కాలంలో కమ్మ, రావులు కలిసి వారి పెత్తనాన్ని కాదన్నారు. మళ్ళీ రాజశేఖరరెడ్డి రాగానే కథ మొదటికొచ్చింది). ఇక్కడ మాత్రం రెడ్డిలదే రాజ్యం. ఉదాహరణకు నిజామాబాద్ జిల్లానే తీసుకుందాం. 2009 ఎన్నికలకు ముందు చిరంజీవి పార్టీ మూలంగా, 'సూర్య' పత్రిక చొరవ మూలంగా బీసీలు కొంత చైతన్యవంతమయ్యారు. తొమ్మిది శాసనసభా స్థానాలలో మూడు బీసీ, ఒకటి రిజర్వుడు ఎస్సీ, ఐదు అగ్రకులాలు గెలిచాయి. టిక్కట్లు వారు తెచ్చుకున్నారు, వారు గెలిచారు. పీసీసీ అధ్యక్షుడు డి. శ్రీనివాస్ ఈ జిల్లా నాయకుడే. రాష్ట్రంలో చక్రం తిప్పగలుగుతారు. కేంద్రంలో పట్టుంది. కానీ జిల్లా నాయకులపై పట్టులేదు. జిల్లాలోని అగ్రకులాలు నిరంతరం శ్రీనివాస్ స్థాయిని తగ్గించాలని చూశాయి. 15 శాతం జనాభా 85 శాతంపై ఆధిపత్యం చేయడం అంటే ఇదే. శ్రీనివాస్ తట్టుకొని ఎదిరిస్తూ వచ్చారు. ఈ సారి ఓడిపోయారు. ఓటమికి- బీసీల పోరాట వీరుని లక్షణాలు లేకపోవటం ఒక కారణం.

ఇప్పటి 'తెలంగాణ షో' పరిస్థితి ఇదే! రేపు తెలంగాణ వస్తే డి. శ్రీనివాస్ ముఖ్యమంత్రి పోటీలో ప్రప్రథముడిగా ఉండకూడదు. ఇది పెద్ద ఎత్తుగడ. పార్టీల కతీతమైన అగ్రకులాల ఎత్తుగడ. అందులో భాగమే తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆవిర్భావం. కోదండరాంరెడ్డి కన్వీనర్ కావటం. తెలంగాణకు నేనే ముఖ్యమంత్రినని ఒకసారి కాదు, రెండు, మూడు సార్లు జానారెడ్డి అన్నారు. దామోదర్ రెడ్డి అడుగులలో అదే భావన కనిపిస్తుంది. ఎన్నడూలేని విజృంభణ. జైపాల్ రెడ్డి ఢిల్లీలో కాచుకుని కూర్చున్నారు. జీవన్ రెడ్డి ముందు వెనకా చూస్తున్నారు. హన్మంతరావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పీఠంపై కలలు కన్నారు. ఒకటి మాత్రం నిజం. తెలంగాణ వస్తే, తెలంగాణ రెడ్డిలు, రావులు ఒకటై అణగారిన వర్గాలనుంచి ముఖ్య మంత్రి కాకుండా అడ్డుకోగలరు. వాళ్ళలో ఒక అభిప్రాయముంది. పోటీ పడితే తాము పోటీ పడతాం, బీసీ లెవరు? ఇదీ రెడ్డి, రావుల భావన. అంటే తమ మధ్యే పోటీ ఉండాలి. అయితే రెడ్డి లేకపోతే రావు. అంతే తప్ప బీసీలు, ఎస్సీలు ఎవరు పోటీ పడడానికి? సిఎం కావడమే కాదు, సిఎంకు పోటీ పడడం కూడా వారు ఇష్టపడరు. తమలో సమానంగా బీసీ, ఎస్సీ ఎవరూ నిలబడకూడదు. ఇది వారి మానసిక దురహంకారం. అందుకే- జాయింట్ ఏక్షన్ కమిటీలో మంద కృష్ణను సమానంగా చూడలేకపోయారు. ఆయనే సూటిగా అన్నారు, పరోక్షంగా అన్నారు.

పిసిసి అధ్యక్షుడు డిఎస్ పట్ల కూడా ఇటువంటి చులకన అభిప్రాయమే ఉంది. నిజానికి ఆయన వర్తమాన రాజకీయాలలో సమర్థుడు, పరిపాలనా దక్షుడు, ఎత్తుగడలలో నేర్పరి. స్వీయ లోపాలు దురదృష్టం కావచ్చు. ఆయన స్వంత నియోజకవర్గంలో బీజేపీ చేతిలో ఓడిపోయారు. అది వేరే విషయం. నిజామాబాద్ జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాలలో ఒకటి మాత్రమే కాంగ్రెస్ గెలుచుకుంది. 2009 ఎన్నికలలో నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలలో కాంగ్రెస్ వ్యతిరేక గాలి నిండుగా ఉంది. ఇక్కడ తప్పు పూర్తిశాతం శ్రీనివాస్‌ది అనలేం. అయితే, ఉప ఎన్నికలలో శ్రీనివాస్ పోటీ చేసి గెలిస్తే- సిఎం రేసులో ఉంటారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులందరూ సంతోషించాల్సిన విషయమే. కానీ కొందరు కావాలని తెలంగాణ సెంటిమెంట్‌ను జోడించి ఏదో మాట్లాడుతున్నారు. శ్రీనివాస్ పోటీ చేయకూడదని, అసలు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ పడకూడదని! ఈ వాదన వెనుక బీసీ వ్యతిరేక రాజకీయ ఎత్తుగడ కనిపిస్తుంది. కానీ దీని వెనుక బీసీ వ్యతిరేక కుట్ర ఉంది. శ్రీనివాస్ వ్యతిరేక రాజకీయ ఎత్తుగడ కనిపిస్తుంది.

శ్రీనివాస్ తనకోసమన్నారా, కాంగ్రెస్ విధానాన్ని ప్రకటించారో తెలియదు కానీ, 'ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పోటీ చేస్తుంది' అన్నారు. ఇది తప్పు కాదు. పోటీ చేయడం కూడా తప్పు కాదు. రాజీనామాలు జాయింట్ ఏక్షన్ కమిటీ సమష్టి నిర్ణయం కాదు. అసలు జేఏసీలో చర్చించలేదు. ఒక సంస్థ మెజారిటీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి. రాజీనామాల విషయంలో చర్చకు ముందే కేసీఆర్ రాజీనామాలు ప్రకటించారు. కీర్తిని మూటగట్టుకున్నారు. ఇక్కడ కాంగ్రెస్ శ్రేణులలో స్వార్థం ఉండవచ్చు. అధిష్ఠాన వర్గాన్ని ధిక్కరించే సాహసం లేకపోవచ్చు. కానీ జేఏసీ నిర్ణయం పేరుతో రాజీనామాలు చేసి టిఆర్ఎస్ తెలంగాణ ఉద్యమంలో పవిత్ర నేతలు తామే అని గుర్తింపు పొందాలని తొందర పడి అడుగులు వేశారు. వారి త్యాగాన్ని ప్రజలు గుర్తించవచ్చు, అనవసర త్యాగమని నిందించ వచ్చు. అది వేరే సంగతి. రాజీనామా చేయని కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను ఉద్యమ ద్రోహులని నిందించారు. కోదండ రామ్ ఏకంగా వారిని సాంఘిక బహిష్కరణ చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఒక దిక్కు కాంగ్రెస్‌ను ప్రజలకు శత్రువుగా మలచాలని టిఆర్ఎస్ రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నప్పుడు కాంగ్రెస్ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ పోటీ చేస్తాననడంలో తప్పు లేదు. శ్రీనివాస్ ప్రకటనపై వేరే పార్టీ విమర్శకు అర్థముంది. కాంగ్రెస్ పార్టీలోని అగ్ర కుల భావజాలం విమర్శలు ఎక్కుపెట్టింది- పోటీ చేయకూడదని, ఏకగ్రీవంగా ఎన్నుకోవాలనీ! దీని వెనుక ఒకటే కనిపిస్తున్నది. శ్రీనివాస్ గెలిచి సిఎం రేసులో తమతో పోటీ పడకూడదు. ఆంధ్రప్రదేశ్‌లో మొదటినుంచి రెండు అగ్రకులాల మధ్య ఆధిపత్య పోరు ఉంది. తెలంగాణలో రెండు అగ్రకులాలతో పోటీగా బీసీలు ఆధిపత్య పోరుకు సిద్ధమవుతున్నారు. నిజానికి తెలంగాణలో బీసీలు మెజారిటీ శాతం ఉన్నా, ఆధిపత్య పోరుకు సిద్ధంగా లేరు. అగ్రకులాలకు డి.శ్రీనివాస్ ఒక పోటీగా కనిపిస్తున్నారు. డి.శ్రీనివాస్ బీసీ అయినా బీసీ నాయకుడు కాదు. బీసీ కులాలను సంఘటిత పరచిన నాయకుడు కాదు. నిజానికి ఆయన అగ్రకులాలతో రాజీ పడు

> తెలంగాణ కోసం ఉద్యమంలో అగ్రగామిలో నిలచింది బీసీలు. మెజారిటీ శాతం బీసీలే ఆత్మత్యాగం చేశారు. అధికారపోటీలో అగ్ర వర్ణాలు! తెలంగాణ ఉద్యమం బలహీన పడడానికి అగ్రవర్గాల మధ్య పోటీ ఒక కారణం కావచ్చు. ఆ కారణం కనిపించదు!

తుంటారు. తమతో రాజీపడేవారు కూడా రాజ్యాధికారంలోకి రాకూడదు. తమతో పోటీ పడకూడదు. ఇదే అగ్రకులాల ఎత్తుగడ. తెలంగాణ బీసీలు రాజ్యాధికారం కావాలని కోరుకుంటున్నారు కానీ వారికి స్పష్టత లేదు. సంఘటిత శక్తి లేదు. సుమారు నూరు కులాలను ఏకం చేసే నాయకత్వం లేదు. అది శ్రీనివాస్‌తో కాదు. శ్రీనివాస్‌కు బీసీ సైద్ధాంతిక దృక్పథం లేదు. ఆయన పక్కా రాజకీయ వాది. అంతే. అందర్నీ కలుపుకుపోవడం అనే సూత్రాన్ని ముందుకు పెట్టి, అందరితో రాజీ పడే నాయకుడు. అటువంటి నాయకుడు కూడా ఆధిపత్యంలో తమ తో పోటీకి రాకూడదని అగ్రకులా భావన.

తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన తర్వాత అకస్మాత్తుగా ఒక రాత్రి కెసీఆర్ జానారెడ్డి ఇంటికి వెళ్ళారు. జాయింట్ ఏక్షన్ కమిటీ ప్రారంభిద్దామని. కేసీఆర్- టీఆర్ఎస్, జానారెడ్డి- కాంగ్రెస్! టీడీపీకి నాగం జనార్దన్ రెడ్డి నాయకత్వం వహించారు. ఈ ముగ్గురు కోదండ రామిరెడ్డి కన్వీనర్‌గా జేఏసీ ఏర్పాటు చేశారు. కనిపిస్తున్న దేమిటి- అంతా ఒకే వర్గం! తెలంగాణ కోసం ఉద్యమంలో అగ్రగామిలో నిలచింది బీసీలు. మెజారిటీ శాతం బీసీలే ఆత్మత్యాగం చేశారు. అధికారపోటీలో అగ్ర వర్ణాలు! తెలంగాణ ఉద్యమం బలహీన పడడానికి అగ్రవర్గాల మధ్య పోటీ ఒక కారణం కావచ్చు. ఆ కారణం కనిపించదు!

# వాచకాలలో అవాక్కులు-1



అక్కిరాజు రమాపతిరావు

గత పది పన్నెండు సంవత్సరాలుగా మన తెలుగు పిల్లలు చదివి నేర్చుకున్న వాచక పుస్తకాలు చూస్తే చాలా విషాదం కలుగుతోంది. ఇప్పుడు ఏ పత్రిక చూసినా తెలుగు భాషకు పట్టిన దైన్యం, తెలుగు అనుభవిస్తున్న దుస్థితి, దుర్గతి ప్రస్తావనకు వస్తున్నాయి. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాల విద్యార్జనను మెరుగు పరచే పథకాలు ప్రణాళికలు, మేథోమథనాలు, వందల వందల కోట్ల రూపాయల కేటాయింపులు, గుణాత్మక విద్య, మధ్యాహ్న భోజనం, పక్కా భవన నిర్మాణాలు, ప్రాథమిక తరగతుల నుంచే ఇంగ్లీషు మాధ్యమం మొదలైన చవులూరించే ఆలోచనలు ప్రసక్తమవుతున్నాయి.

కోమలమైన, లలితమైన, అమాయకమైన, స్వచ్ఛమైన ఆ ఈడు పిల్లలకు తగిన అవగాహన కలిగేట్లు, మనసు వికసించేట్లు, ముందు ముందు తమ భాషా సాహిత్యాల పట్ల మక్కువ కలిగేట్లు, మానవత్వం పెంపొందేట్లుగా ఆ పాఠాలు, విషయాలు ఉండాలని హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సాంబశివరాజు సమాధానించారు. ఆయన తీర్పు ఎంతో బాగుంది! ఇప్పటిదాకా వినియోగించిన వాచక పుస్తకాల తీరు తెన్నులు అందచందాలు స్థాలీపులాకంగా పరిశీలించండి, అవి ఎట్లా అఘోరించాయో చూడండి! ఈ వాచకాలను తయారు చేసినవారు, పర్యవేక్షించిన వారు, సంపాదకత్వం వహించిన వారు అందరూ పేరు ప్రతిష్ఠలు గత ప్రతిభావంతులు. పాఠశాల ఉన్నత తరగతుల దాకా వాచకాలూ, ఉపవాచకాలు మొత్తం కలిపి ఇరవై దాకా ఉండవచ్చు. వీటన్నింటినీ సమీక్షించాలంటే విస్తృతి చాలా అవసరం. అందువల్ల ఎనిమిది, తొమ్మిది పుస్తకాలలో మాత్రమే విషయమూ, బోధనా చాతుర్యమూ ఎలా ఉన్నాయో చుద్దాం. ముందుగా ఈ వాచక పుస్తకాల మీద (అంటే ముఖపత్రం మీద) 'S' అనీ 'F' అనీ (s అంటే 'sale' f అంటే 'free'). తాతాచారి వారి ముద్రలాగా ఈ ఇంగ్లీషు అక్షరాలు తెలుగు వాచక పుస్తకాలపైన ఎందుకో! ఉచిత పంపిణీ అనో, విక్రయానికనో ముద్రించవచ్చు కదా! ఇంగ్లీషునే తెలుగు పిల్లలకు బీజాక్షరాలుగా ఉపదేశించాలనీ, వాళ్ళు ఉపయోగించాలనీ కాబోలు.

మూడో తరగతి వాచకంలో ఆరో పాఠం ఆంధ్రకేసరి గూర్చి ఉంది. ఈ పాఠం పదో వాక్యంలో ప్రకాశం తల్లి సుబ్బమ్మ పేదరికంతో బాధపడుతున్నా 'పట్టుచీర' తాకట్టు పెట్టి పరీక్ష ఫీజులు కట్టింది' అని ఉంది. 'పట్టుచీర' అనడం తప్పు. పట్టు గుడ్డ (పట్టు పొత్తి) లేక పట్టు పంచ అని ఉండాలి. మడి, ఆచారం పాటించే పాత కాలపు కుటుంబాలలో వంట చేయడానికి ముందు స్త్రీలు, భోజనం చెయ్యడానికి ముందు పురుషులు మడి బట్టకు ప్రత్యామ్నాయంగా పట్టు బట్ట కట్టుకునేవారు. ఆ తర్వాత వాక్యంలో 'ప్రకాశం చాలా తెలివితేటలు కలవాడు, ఇమ్మానేని హనుమంతరావు అనే న్యాయవాది ఆయనను చేరదీశాడు. చదువు చెప్పించాడు' అని ఉంది. హనుమంతరావు నాయుడు న్యాయవాది కాదు, ఉపాధ్యాయుడు. ఆయన ఒంగోలులోనూ, రాజమండ్రిలోనూ కూడా ఉపాధ్యాయుడే. ఏడు పేరా గ్రాఫులలో చిన్న పాఠంగా ఉంచవలసివచ్చినా చెప్పిన తీరు చాలా పేలవంగా ఉంది. రెక్కల 'ఏనుగు' అనే పన్నెండో పాఠం అసంబద్ధంగా ఉంది. పిల్లలకు ఉత్సుకత కలిగించదు. పదహారో పాఠం 'దుర్గాబాయి'ని గురించి ఉంది. మూడో తరగతి పిల్లలకు ఎన్నేళ్ళు ఉంటాయి? మహా అయితే తొమ్మిదేళ్ళుంటాయి. మొదటి వాక్యంలోనే 'జాతీయ కాంగ్రెసు మహాసభలు' కాకినాడలో జరిగాయంటే వాళ్ళకు అర్థమవుతుందా! బాల్యం నుంచే సంఘసేవ పట్ల ఆసక్తి కలిగింది 'దుర్గాబాయి'కి- అంటే ఉపాధ్యాయులు పిల్లలకు అర్థమయ్యేట్లు చెప్పగలరా? వాళ్ళు అర్థం చేసుకోగలరా? 'శాంతి సేన' అంటే ఏమిటి? అని ఏ పిల్లవాడైనా, అమ్మాయి అయినా అడిగితే మూడో తరగతి ఉపాధ్యాయుడు చెబుతాడా? ఇరవైమూడో పాఠం 'కృష్ణానది'. శ్రీశైల దేవాలయం చిత్రం ఈ పాఠంలో చేరుస్తూ 'మల్లిఖార్జున స్వామి' అని అక్షరదోషం సహించగలమా? ఆనకట్ట, బారేజీ అనే నిర్మాణాలను ఉపాధ్యాయుడు పిల్లలకు వివరించి బోధించగలడా? ఈ వాచకంలో వచ్చిన కొన్ని పదాలకు పాఠాలన్నీ అయిపోయిన తర్వాత అకారాది క్రమంలో అర్థాలు ఇచ్చారు. ఆనకట్ట, బ్యారేజి, ఆణిముత్యం లాంటి పదాలను ఈ అర్థ వివరణలో చేర్చలేదు.

పెద్దవాళ్ళకు వీటి అర్థాలు తెలిస్తే చిన్న పిల్లలకు తెలుస్తాయా? ఈ వాచక పుస్తకం చిట్టచివరి పుటలో 'ఉపాధ్యాయులకు సూచనలు' అని కొన్ని పుట నిండుగా ఇచ్చారు. 'పిల్లలు తరగతిలో ఎక్కువగా మాట్లాడడానికి అవకాశం కల్పించాలి' అనే మొదటి సూచన పరమ హాస్యాస్ప దంగా, కృతకంగా ఉంది. ఇంగ్లీషులో భావించి తెలుగులో మిడికినట్లు ఉంది. మూడో సూచనలో 'ప్రతి పాఠం చివర కొన్ని కృత్యాలున్నాయి. వాటిని పిల్లలు చేసేటట్లు చూడాలి'- అంటే ఏమిటి? ఎంతకృతకం. బహుశా 'ఎక్సర్ సైస్' అనే మాటను కృత్యంగా అఘోరించినట్లు భావించవలసి వస్తున్నది. అభ్యాస రీతులు, అభ్యాసాలు అనో, అవగాహనలు అనో అనవచ్చు కదా. సవా శేరులో బోడి పరాచికం అన్నట్లు ఇందులో కూడా అచ్చు తప్పులు. ఐదు సార్లు కృత్యాలు అనే పదం వాడారు. ఇందులోని అకృత్యం సంపాదకులకు తెలిసినట్లు లేదు. 'ఇలాంటి వాటిని పిల్లలచే ఎక్కువగా చేయించాలి' అంటే ఏమిటో. ఈ భావం ఒక సూచనలో ఉంది. కృత్యాలనా? అకృత్యాలనా ఒక పాఠం కింద ఇవ్వబడిన అనే పద రూపం ఉంది. ఇచ్చిన అంటే చాలదా? 'బడు' రూపాలు తెలుగుకి అసహజమైనవి అని గిడుగు వారు నెత్తీ నోరు కొట్టుకొని చెప్పారు కదా! పిల్లలకు వాచక పుస్తకాలు కూర్చేవారు గిడుగు వారినైనా చదవవద్దా? నాలుగో తరగతి వాచకంలో పిల్లలకు ఆసక్తి కలిగించేట్లుగా, వాళ్ళ స్థాయికి అనువుగా పాఠాలు లేవు. ఇంతకన్నా చందమామ, బాలమిత్ర, బాల వంటి పత్రికలలో ఎన్నో మంచి కథలున్నాయి, వచ్చాయి. వీటిని ఉపయోగించుకోవడంలో తప్పేమిటి? అదట్లా ఉంచి, ఈ వాచక పుస్తకం చివర ఇచ్చిన 'అకారాది క్రమంలో పదాలు- అర్థాలు' అనే శీర్షిక కింద పుస్తకంలో వచ్చిన పదాలకు ఇచ్చిన అర్థాలు హాస్యాస్పదంగా ఉన్నాయి.

పిల్లల అవగాహన స్థాయిని పెంచేవిగా లేవు. అలంకారాలు- సింగారాలు, ఆనకట్ట- ఏటి అడ్డుకట్ట, కర్తవ్యం- చేయతగినది, కపిల గోవు- పుల్లావు, కరచాలనం- చేతులు కలుపు (విపరీతార్థం కూడా వస్తుంది), జంతుబలి- దేవతల ఉత్సావాలలో జంతువులను చంపడం (కనీసం గ్రామ దేవతలని అన్నా ఇంకా అర్థవంతంగా ఉండేది) పంజరం- పెంపుడు జంతువులను ఉంచే గూడు (పక్షులని చెప్పినా ఇంకాస్త అర్థవంతం), పరిణామం- సంఘటన, ప్రమాణం- బాస, (ఒట్టు అనకూడదా! బాసకు విపులార్థం, విస్తృతార్థాలున్నాయి కదా!) ప్రవేశించి- లోపలికి వచ్చి, శంకుస్థాపన- ప్రారంభానికి గుర్తుగా రాతి పలకను వేయుట- ఇట్లా అర్థాలిస్తే ఎట్లా! ఉపాధ్యాయులకు సూచనలు శీర్షికలో ఈ వాచక పుస్తకం చివర కూడా 'కృత్యాలు' అనే ప్రయోగం ఉంది. అంటే ఏమిటో పాఠ రచయితలకు, బోధకులకు మాత్రమే తెలియాలి.

# తొలి మహిళా ఉపాధ్యాయిని

'బడుగు బలహీన సోదరా లెమ్మురా/ బానిస సంకెళ్ళు తెంచుకొని రమ్మురా/ మనువాద పీష్వాలు మట్టికరచిరి ఇలలోన/ మన విద్యను హరించిన మనువే మురుగయ్యె/ జ్ఞానదాత మేల్కొనరా- ఇంగ్లీషు ఇపుడొచ్చిందిరా/ వేల వేల వత్సరాల మన నిరీక్షణ ఫలియించెరా/ నీ పిల్లల పాపలను చదివించగా కదలిరా/ నా ఆత్మతరంగాలు అవనిలోకి ఎగబ్రాకగ/ బలిరాజ్యపు బావుటాలు జగమంత కాంతులీన/ భయపడకు బ్రాహ్మణుడా, యుద్ధభేరి మోగుతుంది!'

-సావిత్రిబాయి పూలే ('వికసించిన కావ్యకుసుమాలు' నుండి)



కొమ్రన్న

కాటికి కాలు చాపిన పండు ముదుసలికి, ముక్కు పచ్చలారని పసి పిల్లను కట్టబెడితే, అనతి కాలంలో ఆయన కాలం చేస్తే, చితి మీద సతీ సహగమన గండం నుండి గట్టెక్కిన బాలిక- అయిన వాళ్ళు అండగా ఉంటారనుకుంటే, చేరదీసిన వాడే చెరబడితే, గర్భం దాల్చిన బ్రాహ్మణ బాలికలు నేలరాలే రోజులవి. స్పార్టకస్ కాలంలో శిలువ వేసిన బానిసలకన్నా హీనంగా, వితంతు గర్భవతి అయిన పాపానికి, ఎండిన చెట్టు బెరడు తొలచి అందులో ఆమెను ఉంచి నిప్పటించే నికృష్టపు రోజులవి. ఈ దురాచారాలకు ఎదురు తిరిగి, ఆత్మహత్యే శరణ్యమనుకున్న అనాథలను చేరదీసి తన 'బాల హత్య ప్రతిబంధక్ గృహ'లో పురుడు పోసి, జన్మించిన బిడ్డలకు తానే తల్లి అయి సాకిన ఈ దేశపు తొలి మహిళా కిరణం సావిత్రిబాయి పూలే. చితి మంటల నుండి చిరుదివ్వెలను వెలిగించి సహచరుడు మహాత్మా జ్యోతిరావు పూలేకే నిత్య ప్రేరణ అయిన సాధ్వి సావిత్రి బాయి! ఆ సాహసిని స్మరించుకోవటం ఇప్పటికీ అవసరం, అనివార్యం.

సావిత్రి బాయి1831 జనవరి 3 న మహా రాష్ట్రలోని సతారా జిల్లా ఖండాల తాలూకా, నోయిగావ్ గ్రామన, లక్ష్మీబాయి ఖండోజి నవ్సే పాటిల్ దంపతులకు జన్మించింది. బాల్యంలోనే అత్యంత సాహసిగా పేరు తెచ్చుకొంది. పక్షి గుడ్లని తినే ప్రాణాంతక పాములను ఒడిసి పెట్టి విసిరివేసే నేర్పు అలవర్చుకుంది. అతి పిన్న వయస్సులో అంటే ఆమెకు తొమ్మిదేళ్ళ నాడు, పదమూడు సంవత్సరాల జ్యోతిరావుతో పెళ్ళి జరిగింది. అప్పటికే తల్లిని కోల్పోయిన జ్యోతిరావు తన మేనత్త సుగుణ ఇంట్లో నివాసముండేవాడు. సుగుణ ఒక బ్రిటిష్ అధికారి ఇంట్లో ఆయాగా పనిచేస్తూ ఇంగ్లీషు భాష మాట్లాడడం నేర్చుకుంది. అప్పుడే సావిత్రి బాయికి ఆ భాష పట్ల, చదువు పట్ల ఆసక్తి కలిగింది. అందుకు భర్త తోడుగా నిలిచి, ఆమె విద్యాకాంక్షను ద్విగుణీకృతం చేశాడు. ఆ దంపతుల దారిలో వెలుగులు నింపింది విద్య.

అన్ని అడ్డంకులు అధిగమిస్తూ 1847 నాటికే సాధారణ స్కూల్లో మూడవ తరగతి పూర్తి చేసింది. 1948లో శూద్రులు, అతి శూద్ర ఆడపిల్లలు చదువగల తొలి బాలికల పాఠశాలను పూణేలోని భిడేవాడలో ప్రారంభించింది. అందుకు కారకుడైన జ్యోతిరావుతో పాటు, సుగుణ, షేక్ ఫాతిమాల సహకారం కూడా తక్కువేమీ కాదు. బాలికలు అందునా కులం తక్కువ వాళ్ళు చదువుకోవడమనేది ఆనాటి హిందూ సమాజానికి పెను సవాలైంది. మాములు బెదిరింపులకు లొంగనప్పుడు, తాత్విక బోధనలతో విద్యను అడ్డుకునే ప్రయత్నాలు చేసింది. ఆడవాళ్ళు చదువుకుంటే పద్నాలుగు తరాలకు ఆయుక్షీణమని, అది వేద ఘోషయని బుకాయించింది. అన్ని రకాల ఒత్తిళ్ళు ప్రయోగించి విసుగు చెందిన ఛాందస సమాజం- అమాయకులైన అణగారిన కులాల వాళ్లను నమ్మించి సావిత్రి బాయిపై దాడులు చేయించి.(తర్వాత కాలంలో దాడి చేసిన వాళ్ళే నమ్మిన బంట్లుగా మారారు). స్కూలుకు వెళ్ళేటప్పుడు సావిత్రి బాయి విధిగా రెండు చీరలు తీసుకు వెళ్లేది. దారిలో వెళ్ళేటప్పుడు ముతక చీర ధరించేది. ఎందుకంటే దారిలో ఆమెపై పేడ, కోడిగుడ్లు విసరడం సర్వసాధారణం. స్కూలు నుండి తిరిగి వచ్చేటప్పుడు మళ్ళీ ముతక చీర. ఇంత సహనాన్ని కూడా జీర్ణించుకోలేని గుండాలు ఆమెపై అఘాయిత్యానికి తలపడ్డారు. విధిలేని పరిస్థితుల్లో సివంగి అయి శివమెత్తితే, బ్రతుకు జీవుడా అని ఆ ముష్కరులు పలాయనం చిత్తగించక తప్పలేదు. అవమానాన్ని సహించలేని గుండే కాగడాగా, చేతులే కొరడాగా మారక తప్పని పరిస్థితి. అన్ని సవాళ్ళను స్వీకరిస్తూ అనేక స్కూళ్ళను ప్రారంభిం చింది సావిత్రీబాయి. ఆరుగురితో ప్రారంభమయిన పాఠశాలలు వందల సంఖ్యకు ఎదిగిపోయాయి.



సావిత్రీబాయి పూలే
1831 జనవరి 2- 1887 మార్చి 10

కాలం కొలిమిలో కాలిన సావిత్రి బాయి ఆత్మవిశ్వాసం పరిణితి చెంది దినదినం తేజోవంతమయింది. విద్యకు తన తోడ్పాటు నందిస్తూనే అనేక సాంఘిక దురాచారాల మీద యుద్ధం ప్రకటించింది. సతీ సహగమనం, బాల హత్య ప్రతిఘటనకు పేరు గాంచింది. ఎట్టి పరిస్థితుల్లో స్త్రీలకు జీవించే హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదని, దానికి ప్రతిఘటించడానికి ఆడవాళ్ళ ఆత్మ విశ్వాసమొక్కటే మార్గమని ప్రకటించింది. ఆత్మహత్య ప్రయత్నం నుండి కాశీబాయి అనే బ్రాహ్మణ వితంతువును రక్షించి పురుడు పోసి, అమెకు పుట్టిన యశ్వంత్‌ను గొప్ప డాక్టర్‌గా తీర్చి దిద్దటమే కాక, తన దత్తపుత్రునిగా స్వీకరించింది. అణగారిన కులాల అండ దండ ఉన్నంత వరకే అతడు తన వారసుడని ప్రకటించింది.

రెండు శరీరాలు, ఒకే ఆత్మ, ఒకే ఆశయంగా సావిత్రి బాయి, జ్యోతిరావు జీవించారు. ప్రజలతోనే ఆనందం అనుకుని ప్రైవేట్ అనందం వేరే ఒకటుండాలని వారు అనుకోలేదు. 'సత్యశోధన సమాజం' నిర్మాణంలో కీలక భూమిక పోషించిన సావిత్రిబాయి, పూలే మరణాంతరం దాని కార్యక్రమాలను విస్తృతపరచింది. పండిత రమాబాయి, గెక్వాడ్ మహరాజ్ వంటి వారి సహకారంతో పూణేలో ఏర్పడిన క్షామ పరిస్థితులను ఎదుర్కొన్నది. పూలే రచనలతో బాటు తన రచనలకూ గ్రంథం రూపమిచ్చింది. తన తొలి కావ్యం 'కావ్య పూలే' (వికసిత కావ్య కుసుమాలు), 'భావకాశ సుబోధ రత్నాకర్' లను ప్రచురించింది.

1897లో పూణేలో ప్రబలిన ప్లేగు వ్యాధి ఆమెను కలచివేసింది. అప్పటికి ఆ వ్యాది గురించి అవగాహనలేని బ్రిటిష్ ప్రభుత్వానికి ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి. అది ఒక అంటువ్యాది అని గ్రహించిన ప్రభుత్వం రోగులను కిడ్నాప్ చెయటం మొదలు పెట్టింది. వారికి చికిత్స చేసేవారా లేదా చంపేసేవారా అనేది తెలియని పరిస్థితి. తప్పిపోయిన రోగి మళ్ళీ కనపడడం శూన్యం. ఆ పరిస్థితుల్లో సావిత్రిబాయి పూణే పట్టణం చివరనున్న రోగుల వద్దకు వెళ్ళి సపర్యలు మొదలు పెట్టింది. ఆ క్రమంలో ఆ వ్యాధి ఆమెను కబళించింది. అమె అనుకున్న ఆశయం కోసం ఆచరణలో ఆనందంగా కన్ను మూసింది. ఆర్టీసీ కండక్టరు నుండి అంతరిక్ష వ్యోవగామి వరకు ఆడది అబల కాకూడదు అనే ఒక ఆత్మవిశ్వాసాన్ని అందరి ముందు ప్రకటించి మరీ వెళ్ళింది సావిత్రీబాయి పూలే.

*(మార్చి 10 సావిత్రి బాయి 113వ వర్ధంతి)*